సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 26 । జూన్ । 2023



స్వయం సమృద్ధి.. రుణ విముక్తి

సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పథకాల సొమ్మును నేరుగా జమచేయడంతో ఆయా వర్గాలకు ఊరట కలుగుతోంది. 8లో



యువకుడి అనుమానాస్పద మృతి

తణుకులో యువకుడి మృతి కలకలం రేపింది. స్నేహితుడే హత్య చేశాడని మృతుడి బంధువులు ఆరోపిస్తుండగా.. ప్రమాదవశాత్తూ కాల్వలో పడి మృతిచెందాడని పోలీసులు చెబుతున్నారు. 8లో



కన్నపేగును కలిసిన వేళ

పదిహేనేళ్ల తర్వాత కొడుకు కన్నతల్లిని కలిశాడు. ఇన్నాళ్లుగా ఆ కొడుకు అమ్మ కోసం వెతుకుతూనే ఉన్నాడు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో తల్లిని కలుసుకోగలిగాడు. 8లో

కౌలు రైతుకు భరోసా

- 57,500 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు
- ఇప్పటికే 20 వేలకు పైగా జారీ

సాక్షి, భీమవరం: వ్యవసాయం పండుగ చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేస్తోంది. దీనిలో భాగంగా కౌలు రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా వెన్నుదన్నుగా నిలుస్తుంది. అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు) మంజూరు చేస్తోంది. జిల్లాలో సుమారు 2.39 లక్షల ఎకరాల్లో సార్వా వరిసాగు చేయాల్సివుండగా దీనిలో ఎక్కువ భాగం కౌలురైతులే సాగు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు కౌలు రైతులు పొందేందుకు వీలుగా సీసీఆర్ కార్డులు జారీ చేస్తున్నారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 54,500 మంది కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు జారీచేయగా ప్రస్తుత సీజన్‌కు మరో 3 వేల కార్డులు అదనంగా ఇవ్వాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ పనిచేస్తోంది. గ్రామాల వారీగా ఆర్‌బీకే అసిస్టెంట్స్, వీఆర్‌ఏలు కౌలు రైతులను గుర్తించి కార్డులు జారీచేసే ప్రక్రియ వేగంగా నిర్వహిస్తున్నారు. జూలై నెల 15 లోపు కార్డుల జారీ పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.



పాలకోడేరు మండలంలో కౌలు రైతుకు సీసీఆర్ కార్డు అందిస్తున్న దృశ్యం

సకాలంలో కార్డులు అందిస్తాం



జిల్లాలో అర్హులైన కౌలు రైతులందరికీ సీసీఆర్ కార్డులు ఇస్తున్నాం. సాగు హక్కుదారు పత్రాలు పొందిన వారికి ప్రభుత్వ రాయితీలన్నీ వర్తిస్తున్నాయి. జిల్లాలో సుమారు 57,500 కార్డుల జారీ లక్ష్యం కాగా ఇంతవరకు 20 వేలకు పైగా కార్డులు జారీ అయ్యాయి. వచ్చే నెల 15 లోపు కార్డు జారీ పూర్తిచేస్తాం. ఈ ఏడాది పారదర్శకంగా ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియ చేసేందుకు వీలుగా కొత్త యాప్ రూపొందించారు. ఈ క్రాప్ బుకింగ్ రెవెన్యూ, వ్యవసాయ శాఖలను భాగస్వామ్యం చేస్తున్నాం.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యసాయశాఖాధికారి, భీమవరం

సీసీఆర్ కార్డు ద్వారా ప్రయోజనాలివే..

జిల్లాలో వరి చేస్తున్నవారిలో ఎక్కువ శాతం కౌలు రైతులే. రైతుల కోసం అమలుచేస్తున్న సున్నా వడ్డీ రాయితీ, ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంకు రుణాలు, పంటల బీమా, వైఎస్సార్ రైతు భరోసా, ధాన్యం విక్రయాలు వంటి అనేక ప్రయోజనాలు కౌలు రైతులకు అందించేందుకు ప్రభుత్వం సీసీఆర్ కార్డుల ప్రక్రియ ప్రారంభించింది. గతంలో కౌలు రైతులు వరిసాగు చేస్తున్నా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు మాత్రం భూస్వాములకే దక్కేవి. దీంతో అహర్నిశలు కష్టపడి, పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడుతున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. అంతేగాకుండా ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన సొమ్ములు భూస్వాముల బ్యాంకు ఖాతాల్లోనే జమయ్యేది. దీంతో కౌలు రైతులకు లబ్ధి చేకూర్చడానికి భూస్వాములకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సీసీఆర్ కార్డులు జారీ ప్రారంభించారు. కౌలు గుర్తింపు కార్డు పొందిన కౌలు రైతులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందుకోవడమేగాక పండించిన ధాన్యాన్ని నేరుగా విక్రయించుకుని తమ బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమచేయించుకునే అవకాశం ఏర్పడింది.

చెస్ పోటీలకు ఎంపిక



విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ర్యాపిడ్ చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. భీమవరంలోని అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఆదివారం 33 మంది క్రీడాకారులు పాల్గొన్నారని అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ పోటీల్లో పి.సాత్విక్ (తణుకు), ఎస్.సాయికాంత్ (యండగండి) విజేతలుగా నిలిచారన్నారు. భీమవరంలో జూలై 22, 23 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో మైలాపురి మురళి, పి.రవిప్రసాద్, కె.శ్రీలతాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సంతోషంగా ఉంటే.. చంద్రబాబుకు కడుపు మంట

- హరిరామ జోగయ్య సూడో మేధావి
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శ



తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజల సంతోషంగా ఉంటే చూసి ఓర్వలేక కడుపు మంటతో చంద్రబాబునాయుడు విలపిస్తున్నాడని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలోని 20వ వార్డులో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్ కల్యాణ్ తాను పెట్టిన జనసేన పార్టీ అధికారంలోకి రావడానికి కాదు, సమాజం పరివర్తన కోసం పెట్టానని అంటున్నాడన్నారు. కాపు సామాజికవర్గాలు అమితంగా ఉన్న ప్రాంతాల్లో ఇలా మాట్లాడటాన్ని కాపులు అవగాహన చేసుకుంటున్నారన్నారు. కాపులందరూ అన్నివర్గాలతో కలిసి మెలిసి స్నేహంగా ఉంటారన్నారు. పవన్‌కల్యాణ్‌కు మానసికంగా బాగోలేదేమో ఒక్కమారు మానసిక వైద్యుడిని కలిస్తే మంచిదన్నారు. పవన్ మాటలు, పిచ్చిచేష్టలు మానసికంగా ఇబ్బందులు పడే వ్యక్తి మాదిరిగా ఉన్నాయన్నారు. సీనియర్ రాజకీయ నాయకుడు హరిరామ జోగయ్య ఎటు వాటం ఉంటే అటు మొగ్గు చూపే వ్యక్తి అని మంత్రి కొట్టు అన్నారు. కాకినాడ, పిఠాపురం ప్రాంతాల్లో పోటీ చేస్తే ముందే ఓడిపోతామని గ్రహించారన్నారు. గతంలో చిరంజీవిని పాలకొల్లులో పోటీ చేయించి ఓటమి పాలు చేశారని గుర్తుచేశారు. ఇప్పుడు తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం ప్రాంతల్లో పవన్‌ను పోటీ చేయమని హరిరామ జోగయ్య సలహాలు ఇస్తున్నాడన్నారు. జోగయ్య లాంటి సూడో మేధావికి పవన్ మాటలు వినబడటం లేదా? అని ప్రశ్నించారు. ఎవరికి పరివర్తన రావాలో వీరిద్దరు ముందుగా తెల్చుకోలాలని సలహా ఇచ్చారు. జోగయ్య, పవన్‌లు కలిసి కాపులను మోసం చేయాలని అనుకుంటున్నారా? అని ప్రశ్నించారు. చంద్రబాబుని సమర్థించేవారు ఎవరినైనా రాష్ట్ర ప్రజలు చిత్తుగా ఓడిస్తారని మంత్రి కొట్టు అన్నారు.

దొమ్మేటి చిరస్మరణీయుడు

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- తణుకులో దొమ్మేటి విగ్రహం ఆవిష్కరణ

తణుకు అర్బన్: శెట్టిబలిజల ఆరాధ్యుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహం తణుకులో ఏర్పాటుచేయడం చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. తణుకులో శ్రీరామా శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పార్కు ప్రాంత ఆవరణలో ఏర్పాటుచేసిన దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శెట్టిబలిజల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడి విగ్రహాన్ని తణుకులో ఏర్పాటుచేసిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అభినందనీయుడని అన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా శెట్టిబలిజల పిల్లలంతా ఉన్నత చదువులు చదువుకుని మంచి భవిష్యత్తును అందిపుచ్చుకున్నారని.. అదే స్ఫూర్తితో ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత ముందడుగు వేసి ఎంత చదివినా ఉచితంగానే అందించడంతో బీసీ వర్గాల కుటుంబాలు అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు.

5 నెల్లలో శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు నిర్మాణం

శెట్టిబలిజలను బలోపేతం చేసి వారికి వెన్నుదన్నుగా నిలిచిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. తణుకులో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ సభకు హాజరై ఆయన మాట్లాడారు. శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు కోసం స్థలసేకరణ చేశామని, రానున్న 5 నెలలలో భవనాన్ని పూర్తిచేస్తామని చెప్పారు. శెట్టిబలిజలను అభివృద్ధి చేసేందుకు అప్పట్లో 52 ఎకరాల భూమిని దానం చేసి శెట్టిబలిజలకు విద్యాదానం చేసిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి అని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. విగ్రహావిష్కరణకు వచ్చిన అతిథులను శ్రీరామా శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో అశ్వరథంపై ఊరేగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీ అలరించింది. ర్యాలీగా ఎన్టీఆర్ పార్కు ప్రాంతానికి చేరుకున్న మంత్రి వేణుగోపాలకృష్ణ విగ్రహావిష్కరణ చేయగా, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, కుడుపూడి సూర్యనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, దొమ్మేటి వెంకటరెడ్డి మునిమనుమడు, శెట్టిబలిజ సంఘ నాయకుడు డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్‌లు వెంకటరెడ్డి విగ్రహానికి గజమాల వేశారు. సభ అనంతరం శ్రీరామ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్సీలను ఘనంగా సత్కరించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జక్కంశెట్టి సత్య వరప్రసాద్, యువనేత కారుమూరి సునీల్‌కుమార్, సంఘ నాయకులు గురుప్రసాద్, కుడుపూడి భరత్‌భూషణ్, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, చింతపల్లి కనకారావు, కుడుపూడి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



తణుకులో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణలో మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ తదితరులు

విశ్వబ్రాహ్మణుల హర్షం

నరసాపురం రూరల్: రాష్ట్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలలో ధూపదీప నైవేద్యం నిమిత్తం ప్రతి నెల రూ. 5వేలు ఇవ్వాలన్న నిర్ణయంపై ఆ సంఘ సభ్యులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం నరసాపురం పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘ సభ్యులు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఎన్నోఏళ్ల నుంచి ఈ దేవాలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వస్తున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి ధూప దీప నైవేద్యాలకోసం నెలకు రూ.5 వేల చొప్పన ఇచ్చేందుకు నిర్ణయించడం సంతోషం కలిగించే విషయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాదరాజుకు కూడా కృతజ్ఞతలు తెలిపారు. మాట్లాడిన వారిలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ తోటేటి శ్రీకాంతాచారి, స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు పట్నాల శేషగిరిరావు, విశ్వబ్రాహ్మణ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు రాజగోపాలాచారి, మొగడా సత్యనారాయణ, చింతాడ సతీష్, కణితి నాగవెంకట రమేష్‌బాబు, కొమ్మోజు మోహన వెంకటరత్నం తదితరులు ఉన్నారు.



నరసాపురం వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఆలయంలో సమావేశమైన విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు

కవి ప్రసాద్‌కు పురస్కారం

తణుకు: సాహిత్య మాసపత్రిక సాహితీ కిరణం 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయిలో ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన కవితల పోటీల్లో తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. పాదరక్షలను బాగు చేసే చర్మకారుడి జీవితం ఇతివృత్తంగా ప్రసాద్ రచించిన అతని సందేశం కవితకు బహుమతి అందుకున్నారు. ఈ మేరకు గురువారం రాత్రి హైదరాబాదు త్యాగరాయగానసభ కళాసుబ్బారావు కళావేదికపై నిర్వహించిన సభలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి తదితరుల చేతుల మీదుగా బహుమతి, జ్ఞాపిక అందుకున్నారు.

కొల్లేరు ప్రజలకు మంచి రోజులు



సర్కారు కాల్వపై వారధి

- ప్రారంభానికి సిద్ధమవుతున్న సర్కారు కాల్వ వారధి
- పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద అతిపెద్ద అనివేటి మండపం

కైకలూరు: కొల్లేరు ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మంచి రోజులు వచ్చాయి. చిరకాల కలగా మిగిలిన సర్కారు కాల్వపై వారధి ప్రారంభానికి సిద్ధమైంది. సమీప జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద అతిపెద్ద అనివేటి మండప నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సర్కారు కాల్వ వారధికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వారధిగా పేరు ఖరారు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కొల్లేరు ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే గత ప్రభుత్వం భావించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్కడి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. కొల్లేరు ప్రజల ప్రధాన వృత్తి చేపల సాగు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్ చార్జీలను తగ్గిస్తానని సీఎం జగన్ మోహన్‌రెడ్డి వాగ్దానం చేశారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. టీడీపీ పాలనలో యూనిట్ ధర రూ.3.85 ఉండగా జగన్ ప్రభుత్వం రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. కొల్లేరు గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం నిధుల ద్వారా సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, నాడు–నేడులో పాఠశాలల నిర్మాణాలు కొల్లేరు గ్రామాల్లో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

వారధి కల సాకారం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కొల్లేరు అభయారణ్య పరిధిని తగ్గిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించారు. కొల్లేరు ఆపరేషన్ తర్వాత రూ.3,500 కోట్ల పునరావాస ప్యాకేజీని ప్రజలకు అందించారు. ప్రధానంగా కొల్లేరు ప్రజల చిరకాల కల సర్కారు కాల్వపై వారిధి నిర్మాణానికి 2009లో రూ.12 కోట్లను వైఎస్ కేటాయించారు. ఆయన ఆకస్మిక మరణం తర్వాత పనులు జరగలేదు. గత ప్రభుత్వం అంచనాలు పెంచి రూ.14.70 కోట్లు కేటాయించిన పనులను పూర్తి చేయలేదు. సీఎం ప్రత్యేక శ్రద్ధతో స్థానిక ఎమ్మెల్యే డీఎన్నార్ వారధి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. తుది పనులు పూర్తికావడంతో ప్రారంభోత్సవ తేదీ ప్రకటించనున్నారు.

అతిపెద్ద అనివేటి మండపం..

కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం అతి పురాతనమైనది. గత ప్రభుత్వ పాలనలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఎండలో నిలబడాల్సి వచ్చేది. ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రత్యేక శ్రద్ధ వల్ల ప్రజా విరాళాలు దాదాపు రూ.5 కోట్లతో సమీప జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా 305 మీటర్ల పొడవు, 105 మీటర్ల వెడల్పుతో భారీ అనివేటి మండపం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రధాన పనులు పూర్తయ్యాయి. వివిధ రకాల శిల్పాలను కళాకారులు సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా అమ్మవారి జాతరలో కలవబోనాలను అతి వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఇక రెండు పూటలా స్కూళ్లు

- ఎండల తీవ్రతతో 24 వరకు ఒంటిపూట బడుల నిర్వహణ
- నేటి నుంచి రెండు పూటల బడులు

సాక్షి, భీమవరం: జిల్లాలో ఈనెల 26 నుంచి రెండు పూటల స్కూళ్లు నిర్వహించనున్నారు. వేసవి సెలవుల అనంతరం ఈనెల 12 నుంచి సర్కారుబడుల్లో విద్యాబోధన ప్రారంభమైంది. అయితే ఎండల తీవ్రత కారణంగా ఈనెల 17 వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఎండలు ప్రభావం తగ్గకపోవడంతో 24 వరకు పొడిగించింది. గత నాలుగు రోజులుగా వర్షాలు కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో సోమవారం నుంచి పూర్తిస్థాయిలో రెండు పూటల తరగతులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సూల్స్ ప్రారంభం రోజు నుంచే విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కానుక పంపిణీ చేపట్టారు. సోమవారం నుంచి పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉదయం 10 గంటలకు రాగిజావ పంపిణీ, మధ్యాహ్నం 12.30 గంటలకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు.

పాఠశాల ప్రారంభం రోజునే విద్యాకానుక పంపిణీ

పేదల చదువులకు పెద్ద పీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలు ప్రారంభించిన రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించాలని ఆదేశించడంతో ఈ మేరకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసి పంపిణీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు 10వ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించి నియోజకవర్గ, జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు నగదు బహుమతులు, సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలోని విద్యార్థులకు జిల్లాలోని 7 నియోజకవర్గ కేంద్రాల్లో సన్మానాలు నిర్వహించగా జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా సత్కరించారు.

పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 1,359 ప్రభుత్వ పాఠశాలలుండగా దాదాపు 1.14 లక్షల మంది విద్యార్థులు, ఏలూరు జిల్లాలో 1,857 స్కూళ్లలో 1,57,845 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయి సదుపాయాలు కల్పించడంతోపాటు పేద విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో ఏటా రూ. 15వేలు జమచేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఘననీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.



భీమవరం పీఎస్ఎం గరల్స్ హైస్కూల్లో విద్యార్థులు

నేటి నుంచి రెండు పూటలా బడులు



ఎండల తీవ్రత దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా 24 వరకు ఒంటిపూట బడులు నిర్వహించగా నేటి నుంచి రెండుపూటల బడులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశాం. ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులుంటాయి.

– ఆర్.వెంకటరమణ, జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం

న్యూస్‌రీల్

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావుకు శ్రీవారి మెమెంటోను అందజేస్తున్న ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ విజయరాజు

ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం సందర్శించారు. ముందుగా కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ ఎం.విజయరాజు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమడోలు కోర్టు న్యాయమూర్తి ఆదిత్య రిషిక్, తహసిల్దార్ సతీష్, ఎస్సై టి.సుధీర్ తదితరులున్నారు. అలాగే గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని ఆదివారం జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో జడ్జికి స్వాగతం పలికారు.

ఎంఎస్ఎంఈ తెలంగాణ వైస్ ఇన్‌చార్జిగా అమర్‌నాథ్



ఎంఎస్ఎంఈ తెలంగాణ వైస్ చైర్మన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరిస్తున్న పువ్వాడ రాజా అమర్‌నాథ్

ఆకివీడు: ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ కార్యవర్గాన్ని దేశవ్యాప్తంగా విస్తరింపజేసి, యువశక్తిని సద్వినియోగం చేసుకునేందుకు సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర ప్రమోషన్ కౌన్సిల్ వైస్‌చైర్మన్ పువ్వాడ రాజా అమర్‌నాథ్ చెప్పారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న న్యూఢిల్లీలోని అశోక్ రోడ్డులోని జరిగిన మీట్–గ్రీట్ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ ఇన్‌చార్జి బాధ్యతల్ని అప్పగించారని చెప్పారు. యువశక్తి ఆర్థిక శక్తిగా ఎదిగేలా ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయానికి సంస్థ కట్టుబడి పనిచేస్తుందని అమర్‌నాథ్ చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ ఇన్‌చార్జి కేంద్ర మంత్రి ప్రద్యుమాన్ కుమార్‌జీ, ఎంఎస్ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారని చెప్పారు.

గుబ్బల మంగమ్మకు బోనాల సమర్పణ



గుబ్బల మంగమ్మ గుడికి బోనాలను నెత్తిన పెట్టుకుని వెళ్తున్న భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచి వర్షాన్ని సైతం లెక్క చేయకుండా మంగమ్మ తల్లి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెలంగాణతో పాటు ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన భక్తులు ఆషాఢ మాస బోనాలతో పాటు సన్నాయి వాయిద్యాలతో అమ్మవారి సన్నిధికి ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంతో తాము బోనాలు సమర్పించి పూజలు చేస్తామని భక్తులు తెలిపారు. లారీలు, ఆటోలు, బస్సులు, జీప్‌లు, ద్విచక్ర వాహనాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కమిటీవారు భక్తులకు ట్రాఫిక్ సమస్య, ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపట్టారు.

28న కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 28న బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని, సభ్యులు విధిగా హాజరు కావాలని చెప్పారు.

క్లుప్తంగా

ఏలూరులో భారీ చోరీ

175 కాసుల బంగారు ఆభరణాల అపహరణ



ఇంట్లో బెడ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న సీసీఎస్ సీఐ మురళీకృష్ణ, వన్‌టౌన్ సీఐ ఆదిప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు శ్రీరామ్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని 9వ రోడ్డులో నివాసం ఉంటున్న నీలి దుర్గావెంకట పద్మనాగేంద్రరావు ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటారు. ఈనెల 23న వ్యక్తిగత పనులపై ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా రాజమహేంద్రవరం వెళ్లారు. మళ్లీ 24వ తేదీ రాత్రికి ఇంటికి చేరుకున్నారు. అయితే తలుపునకు వేసిన తాళం తీసి ఉండటాన్ని గమనించిన పద్మనాగేంద్రరావు అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉండాల్సిన 175 కాసుల బంగారపు ఆభరణాలు, రూ.750 నగదు కనిపించకపోవడంతో ఏలూరు త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం ఉదయం ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్, ఏలూరు త్రీటౌన్ సీఐ కేవీఎస్ వరప్రసాద్, ఎస్ఐ శంకర్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వయం సమృద్ధి.. రుణ విముక్తి

సంక్షేమ కాంతులు

- పేద, మధ్యతరగతి వర్గాలను ఆదుకుంటున్న పథకాలు
- తగ్గిన అప్పుల భారం
- ఆర్థిక సాధికారతకు ప్రభుత్వ తోడ్పాటు



భీమవరం(ప్రకాశం చౌక్): ప్రతిఇంటా సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రభుత్వ పథకాలు అండగా నిలుస్తున్నాయి. ఆరోగ్యం, కుటుంబ అవసరాలు, పిల్లల చదువులకు అప్పులు చేసే పరిస్థితి లేదు ఇప్పుడు. రాష్ట్రంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకాల రూపంలో నేరుగా సొమ్ములు జమచేయడంతో ఆయా వర్గాలకు ఊరట కలుగుతోంది. చిన్నపాటి అప్పుల కోసం బ్యాంకులు, వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన అవసరం తప్పింది.

అప్పుతిప్పలు లేవు

గతంలో రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వ్యక్తిగత రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఆయా రుణాల కోసం సిఫార్సులు కూడా చేయించుకోవాల్సి వచ్చేది. ఈ క్రమంలో కొందరికే రుణాలు అందేవి. ప్రధానంగా గ్రామీణ ప్రజలకు రుణాలు అందడం కష్టంగా ఉండేది. దీంతో వీరంతా ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు, వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి రుణాలు పొందేవారు. అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి. గత టీడీపీ పాలనలో విజయవాడలో వెలుగుచేసిన కాల్‌మనీ కేసులే ఇందుకు నిదర్శనం. అయితే ప్రస్తుతం ఈ పరిస్థితి ఎక్కడా లేదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో చిన్నపాటి రుణాల కోసం అప్పులు చేయాల్సిన అవసరం ఉండటం లేదు.

పైసా ఖర్చు లేకుండా విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యను అందించడంతో పాటు జగనన్న విద్యాకానుక ద్వారా ప్రభుత్వం విద్యా సామగ్రి అందిస్తోంది. అలాగే అమ్మఒడి పథకం కింద ఏటా రూ.15 వేల సాయం అందిస్తున్నారు. దీంతో పాటు విద్యా దీవెన, వసతి దీవెనల పథకాలతో డిగ్రీ, పీజీ చదువులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలకు పిల్లల చదువుల భారం తగ్గింది.

ఆర్థిక అవసరాలు తీర్చేలా..

రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఏడాదికి రూ.18,750, కాపు మహిళలకు కాపునేస్తం పథకం కింద రూ.15 వేలు, అగ్రవర్ణ పేద మహిళలకు ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. దీంతో కుటుంబాల్లో ఆర్థిక అవసరాలు తీరుతున్నాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే వైఎస్సార్ ఆసరా పథకం కింద డ్వాక్రా మహిళలకు రుణమాఫీ సొమ్ములు అందిస్తోంది. అలాగే రైతులకు రైతు భరోసా, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర వర్గాలకు వైఎస్సార్ పెన్షన్ కానుక వంటి పథకాలు వారి అవసరాలను తీర్చుతున్నాయి.

అద్దెల నుంచి విముక్తి : ప్రభుత్వం అర్హులందరికీ స్థలం మంజూరు చేయడంతో పాటు ఇంటి నిర్మాణాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తోంది. దీంతో పలువురు ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుని గృహ ప్రవేశాలు చేస్తున్నారు. అద్దె బాధలు తప్పాయని వీరంతా అంటున్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగేళ్లలో పథకాల లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్సార్ చేయూత	2.07 లక్షలు	389.68
జగనన్న అమ్మఒడి	4.32 లక్షలు	648.03
వైఎస్సార్ ఆసరా	2.40 లక్షలు	533.90
జగనన్న విద్యాదీవెన	43,790	295.75
వైఎస్సార్ పెన్షన్ కానుక	2.20	2,880.00

చిన్నపాటి రుణాలు తగ్గాయి



ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించడం, రైతులకు పెట్టుబడి నిమిత్తం రైతు భరోసా వంటి పథకాలు అమలు చేయడంతో గతంలో మాదిరిగా బ్యాంకుల నుంచి చిన్నపాటి రుణాలు పొందేవారి సంఖ్య తగ్గింది. గతంలో రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వ్యక్తిగత రుణాల కోసం బ్యాంకులు చాలా మంది వచ్చేవారు. ప్రస్తుతం ఇటువంటి వారి సంఖ్య తగ్గింది.

–ఎన్‌వీ రమణ, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్, భీమవరం

సాఫీగా పిల్లల చదువులు



నాకు ఇద్దరు పిల్లలు. కూలి పనులపైనే ఆధారం. గతంలో పిల్లల చదువు, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేసేవాళ్లం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మఒడి, విద్యాదీవెన పథకాలతో పిల్లల చదువులు సాఫీగా సాగుతున్నాయి. సీఎం జగన్ ఏటా సాయం అందించడం చాలా ఆనందంగా ఉంది. గతంలో ఇద్దరు పిల్లల చదువుకు చాలా ఇబ్బంది పడ్డాను. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

–కె.సత్యవతి, 12వ వార్డు, భీమవరం

'చేయూత' తోడుగా..



వైఎస్సార్ చేయూత పథకంలో నాకు మూడు విడతలుగా రూ.18,750 చొప్పున ఆర్థిక సాయం అందింది. నా కుటుంబ అవసరాలకు చేయూత బాగా ఉపయోగపడుతోంది. గతంలో ఆరోగ్యానికి, కుటుంబ అవసరాలకు అప్పులు చేయాల్సి వచ్చేది. సీఎం జగన్ నేరుగా ఆర్థిక సాయం అందించడంతో ఆ లబ్ధితో కుటుంబ అవసరాలు తీర్చుకుంటున్నా. ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం పొందుతున్నా.

– జి.రమణమ్మ, 26వ వార్డు, భీమవరం

పరశురామావతారంలో జగన్నాథుడు



పరశురాముని అలంకరణలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జగన్నాథుడు ఆదివారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న రథోత్సవాలను పురస్కరించుకుని స్వామి వారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులను కటాక్షిస్తున్నారు. అందులో భాగంగా ఒక చేత్తో గండ్ర గొడ్డలి, మరో చేత్తో కమండలాన్ని పట్టుకుని ఉన్న పరశురాముడి రూపంలోని జగన్నాథుడిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

బాలుడి అదృశ్యం



చట్ల సుభాష్ (ఫైల్)

పెనుగొండ: పెనుగొండ అంబేడ్కర్ కాలనీకి చెందిన చట్ల సుభాష్ (13) అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందినట్లు ఎస్సై ఎన్‌వీ రమేష్ ఆదివారం చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని, ఎవరికైనా వివరాలు తెలిస్తే పెనుగొండ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299 [B-2363]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781985]

MINI GEEZER

■ శ్రీ గాయత్రి మినీ గీజర్స్ (5 sec.లో వేడి నీళ్ళు) సేల్స్ చేయుటకు డీలర్స్ కావలెను. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం. సంప్ర. సెల్ : 96663 32323, 95506 92836. [M-1221206]

Wanted

■ ప్రముఖ విద్యాసంస్థ నందు బోధించుటకు టీచర్స్ కావలెను. వసతి కలదు. అర్హత : B.Ed., D.Ed., B.Tech., సంప్రదించండి : 95021 46611. [P-1167970]

■ తణుకు క్లాత్ షోరూమ్‌లో లేడీ సూపర్‌వైజర్ కావలెను. వయస్సు 30 నుండి 40 సంవత్సరాలలోపు, ఎత్తు 5.5 అ॥. సంప్రదించండి : 98855 91188. [P-624]

■ బ్యాంక్‌లలో (ఆఫీస్ వర్క్స్) పర్మినెంట్‌గా Q 10th- డిగ్రీ జీ॥ 26,000/- కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ @Ph: 8332809093 [H-781446]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K హైదరాబాద్ : 9640258899, విజయవాడ: 9640648899 [HA-337]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- స్నేహితుడే హత్య చేశాడంటున్న బంధువులు
- తణుకులో రోడ్డుపై బైఠాయించి నిరసన
- ప్రమాదవశాత్తు కాల్వలో పడ్డాడంటున్న పోలీసులు



నల్లా జగత్ కల్యాణ్ (ఫైల్)



తణుకులో రోడ్డుపై బైఠాయించి నిరసన తెల్పుతున్న మృతుడి బంధువులు, స్నేహితులు

తణుకు: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందగా, స్నేహితుడే హత్య చేశాడని మృతుడి బంధువులు, స్నేహితులు ఆరోపిస్తుండగా, ప్రమాదవశాత్తూ కాల్వలో పడి మృతి చెందాడని పోలీసులు చెబుతున్నారు. ఆదివారం రాత్రి తణుకులో మృతుడి బంధువులు, స్నేహితులు రోడ్డుపై బైఠాయించడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంలోని పాతవూరుకు చెందిన నల్లా జగత్ కల్యాణ్ (18), సప్పా అజయ్‌కుమార్ స్నేహితులు. ఈ నెల 20న అర్ధరాత్రి తాడేపల్లిగూడెంలో మద్యం తాగిన వీరు టిఫిన్ చేసేందుకు మోటారు సైకిల్‌పై తణుకు వచ్చారు. స్థానిక తేతలి వైజంక్షన్ వద్ద టిఫిన్ చేసి తిరిగి బయలుదేరారు. అయితే మరుసటి రోజు అజయ్‌కుమార్ మాత్రమే తాడేపల్లిగూడెం చేరుకోవడంతో స్నేహితులు ఆరా తీశారు. తనకు తెలియదని తన మోటారు సైకిల్ తీసుకుని ఎక్కడికో వెళ్లి ఉంటాడని పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో అనుమానం వచ్చిన స్నేహితులు తాడేపల్లిగూడెం పోలీసులకు సమాచారం అందించారు. అజయ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, మద్యం మత్తులో అసలేం జరిగిందో గుర్తు లేదని చెప్పాడు. ఇదిలా ఉంటే ఈనెల 24న తణుకు మండలం తేతలి గ్రామం పరిధిలోని కాల్వలో గుర్తు తెలియని మృతదేహం ఉందని వచ్చిన సమాచారంతో తణుకు రూరల్ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కల్యాణ్ ఆచూకీ కోసం గాలిస్తున్న స్నేహితులు, బంధువులు తణుకు వద్ద దొరికిన మృతదేహం కల్యాణ్‌దిగా నిర్ధారించారు. దీంతో మరోసారి పోలీసులు అజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేశానని ఒప్పుకోవడంతో తొలుత హత్యగా భావించారు.

ప్రమాదమే అంటున్న పోలీసులు

కల్యాణ్ మృతదేహాన్ని శనివారం గుర్తించిన తణుకు పోలీసులు అదే ప్రాంతంలో మోటారు సైకిల్‌ను ఆదివారం గుర్తించారు. దీంతో అజయ్‌కుమారే హత్య చేసినట్లుగా భావించారు. అయితే విచారణ చేపట్టిన పోలీసులు మృతదేహం, బైక్ దొరికిన ప్రాంతంలో లభ్యమైన ఆధారాలు నేపథ్యంలో రోడ్డు ప్రమాదంలోనే కల్యాణ్ మృతి చెందినట్లు నిర్ధారణకు వచ్చారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, సీఐ నాగరాజు, తణుకు రూరల్ సీఐ ఆంజనేయులు, ఎస్సై గుర్రయ్య ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. తణుకు జాతీయ రహదారిపై టిఫిన్ చేసిన అనంతరం తేతలి వంతెన వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి బైక్‌తో సహా కల్యాణ్ కాల్వలోకి పడిపోయి ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. మద్యం తాగి ఉన్న అజయ్‌కుమార్ గట్టుపై పడి స్పృహ వచ్చి చూసేసరికి కల్యాణ్ లేకపోవడంతో దువ్వ సెంటర్ వరకు నడిచి వచ్చి అక్కడే గుడిలో నిద్రించి ఉదయం తాడేపల్లిగూడెం వెళ్లాడు. కల్యాణ్ కోసం ఆరా తీసిన స్నేహితులకు ఏం జరిగిందో తనకు గుర్తు లేదని బైక్‌పై ఎక్కడికో వెళ్లి ఉంటాడని అందరికీ చెప్పాడు. ఇదే నిజమనుకున్న బంధువులు, స్నేహితులు కల్యాణ్ మృతదేహం లభ్యం కావడం అనుమానాలను రేకెత్తించాయి.

రోడ్డుపై బైఠాయించి నిరసన

తణుకులో లభ్యమైన మృతదేహం కల్యాణ్‌దేనని నిర్ధారించుకున్న తర్వాత అజయ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్న తాడేపల్లిగూడెం పోలీసులు తమదైన శైలిలో విచారణ చేయడంతో తానే హత్య చేశానని ఒప్పుకున్నాడని పోలీసులకు తమకు సమాచారం ఇచ్చినట్లు స్నేహితులు, బంధువులు చెబుతున్నారు. ఆదివారం ఉదయం వరకు హత్యగానే భావించినప్పటికీ రోడ్డు ప్రమాదంలోనే కల్యాణ్ మృతి చెందాడని, దీంతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లుగా కేసు నమోదు చేయడంపై మృతుడి బంధువులు, స్నేహితులు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. తణుకు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తీసుకెళ్లబోమంటూ బైఠాయించి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు రాస్తారోకోకు దిగారు. సీఐ ఆంజనేయులు, ఎస్సై గుర్రయ్య వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు రూరల్ ఎస్సై కె.గుర్రయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు మాట్లాడుతూ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని పోస్టుమార్టం నివేదిక ఆధారంగా సమగ్ర దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం 20వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

కన్నపేగును కలిసిన వేళ..

15 ఏళ్ల తరువాత కలుసుకున్న తల్లీకొడుకులు



వృద్ధాశ్రమం నుంచి తల్లిని తీసుకెళ్లేందుకు వచ్చిన కుమారుడుతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

కంచిలి: పదిహేనేళ్లుగా ఆ మాతృమూర్తి కొడుకును చూడలేదు.. తన ఇంటికి వెళ్లలేదు.. కుటుంబాన్ని కలవలేదు. మరోవైపు ఇన్నాళ్లుగా ఆ కొడుకు అమ్మ కోసం వెతుకుతూనే ఉన్నాడు. నేడో, రేపో తల్లి ఇంటికి రాకపోదా అని ఆశగా ఎదురుచూస్తూనే ఉన్నాడు. అనునిత్యం అమ్మ కోసం తాపత్రయపడ్డాడు. 15 ఏళ్ల ఎడబాటు తర్వాత ఆ తల్లీకొడుకులు మళ్లీ కలిశారు. మతిస్థిమితం కోల్పోయిన ఆ తల్లి అయినవాళ్లందరికీ దూరమైపోగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో మళ్లీ మామూలు మనిషై కన్నపేగును కలుసుకుంది. వివరాల్లోకి వెళితే.. మొగల్తూరుకు చెందిన గండుపల్లి లక్ష్మి పదిహేనేళ్ల కిందటి వరకు అందరి లాగానే సాధారణ గృహిణి. భర్త మరణంతో ఆమె మతిస్థిమితం కోల్పోయి కొడుకు కామదాసును విడిచిపెట్టి వెళ్లిపోయింది. రోడ్లపై తిరుగుతున్న ఆమెను రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు ఆదరించి ఆరు నెలలపాటు వైజాగ్‌లో చికిత్స చేయించారు. ఆమె కోలుకున్న తర్వాత మనోబంధు సంస్థకు అప్పగించగా.. వారు మూడు రోజుల కిందట సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి తీసుకువచ్చారు. ఆమెతో పాటు మరో నలుగురు ఇక్కడకు వచ్చారు. వారి నుంచి ఫౌండేషన్ సభ్యులు వివరాలు సేకరించి పత్రికలు, సోషల్ మీడియాల్లో ఉంచారు. ఈ సమాచారం మొగల్తూరులోని కొడుకు కామదాసుకు చేరడంతో తన తల్లి కంచిలి మండలంలో ఉందని తెలిసి సంతోషపడ్డాడు. రెడ్‌క్రాస్ సభ్యులను సంప్రదించి కంచిలి మండలానికి వచ్చి ఆదివారం తల్లిని కళ్లారా చూశాడు. ఆమె కూడా కొడుకును గుర్తుపట్టడంతో ఆ ఉద్వేగ సన్నివేశాన్ని చూసి స్థానికులు కంటనీరు పెట్టుకున్నారు. అనంతరం ఆయన తన తల్లిని స్వగ్రామానికి తీసుకువెళ్లాడు. తల్లీకొడుకులను కలిపిన మనోబంధు సంస్థ కన్వీనర్ బీన ఢిల్లీరావు, సూపర్‌వైజర్ పాల సురేష్, రెడ్‌క్రాస్ సంస్థ షెల్టర్ మేనేజర్ ఎ.మురళి, సీతయ్య ఫౌండేషన్ సభ్యుడు సానా గణేష్‌లకు సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్, మోహనరావులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుదాఘాతానికి వృద్ధురాలి మృతి



వృద్ధురాలు రత్నకుమారి మృతదేహం

భీమవరం అర్బన్: పెదగరువు పంచాయతీ చినగరువులో శనివారం రాత్రి ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగి మీద పడటంతో ఓ వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రత్నాల రత్నకుమారి (62) ఒంటరి మహిళ. పశువులు మేపుకుంటూ వచ్చిన సొమ్ముతో జీవనం సాగిస్తోంది. శనివారం రాత్రి పశువుల చూడటానికి బయటకు రాగా గాలులకు విద్యుత్ వైరు తెగి రత్నకుమారి మీద పడటంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామంలో విద్యుత్ హైటెన్షన్ వైర్లు మార్చి దశాబ్దాలు కావడంతో పాతబడి ఈదురు గాలులకు తెగిపడ్డాయని గ్రామస్తులు చెబుతున్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ..

- కారు ప్రమాదంలో చిన్నారి మృతి, మరో ఆరుగురికి గాయాలు
- ఏలూరు శివారు చొదిమెళ్ల వద్ద ఘటన



మృతి చెందిన చిన్నారి ప్రణీత

ఏలూరు టౌన్: ఏలూరు శివారు జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన కారు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు కాగా వారిలో ఐదేళ్ల వయస్సున్న చిన్నారి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన సిస్టా శ్రీనివాస సుబ్రహ్మణ్య సమీర్‌కుమార్ అదే గ్రామంలో కెనరా బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ద్వారకాతిరుమల దైవదర్శనానికి భార్య పద్మావతి, కుమారుడు శ్రీకృష్ణ, తల్లి సీతాకుమారి, చెల్లెలు రాంపల్లి వందన, చెల్లెలి కుమార్తెలు ప్రజ్ఞా, సీతాఅలివేలి ప్రణీతతో కలిసి కారులో ప్రయాణమయ్యారు. దైవదర్శనం ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. సమీర్ కుమార్ కారు నడుపుతున్నారు. జాతీయ రహదారి ఏలూరు సమీపంలోని చొదిమెళ్ల వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని ఎడమవైపు నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా, కారులోని ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా, వీరిలో చిన్నారి ప్రణీత (5) మృతి చెందినట్లుగా నిర్ధారించారు. మిగిలిన వారికి చికిత్స అందించారు. ఈ ప్రమాదంపై ఎస్పీ డి.మేరీ ప్రశాంతి స్పందిస్తూ క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏలూరు వన్‌టౌన్ సీఐ బోణం ఆదిప్రసాద్, రూరల్ ఎస్ఐ లక్ష్మణబాబు ఆసుపత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించేందుకు బాధితులను విజయవాడ తరలించారు.

ప్రైవేట్ ల్యాబ్‌లో చోరీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బైపాస్ రోడ్డులో హేమంత్ డయాగ్నోస్టిక్స్‌ను గొడపర్తి కోదండ రామకిరణ్‌కుమార్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 19న ఉదయం ల్యాబ్ తెరిచేందుకు వెళ్లగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించగా, రూ.3.50 లక్షల విలువైన పరికరాలు, కంప్యూటర్ తదితర వస్తువుల అపహరణకు గుర్తించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కిటకిటలాడిన కేపీపాలెం బీచ్



కేపీపాలెం బీచ్‌లో సేదతీరుతున్న సందర్శకులు

మొగల్తూరు: కేపీ పాలెం బీచ్‌కు ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి మబ్బులు, చల్లని వాతావరణం ఉండటంతో పర్యాటకులు సముద్రస్నానం చేస్తూ సేదతీరారు. అనంతరం తీరంలోని వెంకటేశ్వరస్వామి, వేలాంకణీ మాత, పాండురంగస్వామి, 54 అడుగుల అభయాంజనేయ స్వామి, షిర్డీ సాయిబాబా, అష్టలక్ష్మి ఆలయాలను దర్శించుకున్నారు.

టెన్త్ పరీక్షలో ఫెయిలైందని విద్యార్థిని బలవన్మరణం

ఏలూరు టౌన్: పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు రూరల్ ప్రాంతం బాబూజగ్జీవన్‌రామ్‌పేటకు చెందిన వెంట్రపాటి వెన్నెల (17) 2022లో టెన్త్ పరీక్షలు రాసింది. సోషల్, లెక్కలు ఫెయిల్ కావటంతో మళ్లీ ప్రయత్నించగా సోషల్‌లో ఉత్తీర్ణత సాధించి లెక్కల్లో తప్పింది. మరోసారి పరీక్షల్లో విఫలం కావటం, ఈ నెల 23న విడుదలైన సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లోనూ లెక్కలు పరీక్షలో మళ్లీ ఫెయిలైంది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం తల్లిదండ్రులు, తమ్ముడు గుడికి వెళ్లగా తనకు నీరసంగా ఉందని రాలేనని చెప్పి వారు వెళ్లిన అనంతరం ఇంట్లో దూలానికి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏలూరు రూరల్ ఎస్సై లక్ష్మణబాబు మృతదేహాన్ని ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తణుకు పురపాలక సంఘం

టెండరు నోటీసు

[illegible] 01/01/2023/[illegible] తేది: [illegible].06.2023

తణుకు పురపాలక సంఘం పరిధిలో [illegible] ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి. (రూ.లక్షలలో)
1) రోడ్డు పనులు	7 నెం.లు	61.04
2) [illegible] పనులు	14 నెం.లు	77.38
3) బిల్డింగ్ పనులు	3 నెం.లు	30.35
4) ఇతరములు	1 నెం.లు	8.47

సంబంధిత వివరములకు WWW.apeprocurement.gov.in వెబ్ సైటు నందు ది. 27.06.2023వ తేది నుండి చూడవచ్చును.

కమిషనరు,
తణుకు పురపాలకసంఘం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జిల్లా స్త్రీ మరియు శిశు అభివృద్ధి సంస్థ, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం.

షార్ట్ టెండర్ నోటిఫికేషన్

ఆర్.సి.నం.224/[illegible]/2023 తేది: 25.06.2023

[illegible] 28.06.2023 [illegible] 5.00 [illegible] 30.06.2023 [illegible] 11.00 [illegible] 4.00 [illegible] 77020 44768, 94405 95988, 94419 78801

బి.సుజాతారాణి
జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ మరియు సాధికారిత అధికారిణి, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం

భీమవరం
తేది: 25.06.2023

క్లుప్తంగా

సూర్యనారాయణస్వామికి అభిషేకాలు



వాసవి ఆలయంలో సూర్యనారాయణ స్వామి

తాడేపల్లిగూడెం (టీఓసీ) : వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో శోభకృత్ నామ సంవత్సరం ఉత్తరాయణం ఆషాడ మాసం ఆదివారం సప్తమి సందర్భంగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు విఘ్నేశ్వర పూజ, సూర్యానారయణ స్వామికి పంచామృతాలు, ఫలరసాలు, సుగంధద్రవ్యాలు, గంధంతో విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆర్య వైశ్య ప్రముఖులు, వాసవి క్లబ్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ వారికి వెండి సమర్పణ



ముత్యాలమ్మ వారి చీరకు వెండి సమర్పిస్తున్న దాతలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబపురం శ్రీముత్యాలమ్మ వారి చీర నిమిత్తం తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన నల్లూరి రాఘవేంద్రరావు – కృష్ణకుమారి దంపతులు 272.600 గ్రాముల వెండిని ఆదివారం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఈకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.హరేరామ్‌ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

42.2 మి.మీ. వర్షపాతం నమోదు



తాడేపల్లిగూడెంలో కురుస్తున్న వర్షం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 42.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వైకేవీ అప్పారావు ఆదివారం తెలిపారు. కాగా, పెంటపాడు మండలంలో 32.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు.


పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



మొక్కలను నాటుతున్న మహిళా వాకర్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అన్నారు. ఎయిర్‌స్ట్రిప్ వాకింగ్ ట్రాక్ వద్ద ఆదివారం మహిళా వాకర్స్‌చే పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కాలుష్యం భారీ నుంచి రక్షణ కోసం, వేసవిలో వేడి వాతావరణం లేకుండా ఉండేందుకు మొక్కలు అవసరం ఎంతో ఉందని అన్నారు. మొక్కలను రక్షించాలని కోరారు. కనకదుర్గ, ఉదయకుమారి, ఇందిరా కుమారి, వజ్రమ్మ, భార్గవి, నాగ సౌభాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీబీసీ సర్టిఫికెట్స్ అందజేత



సీబీసీ సర్టిఫికెట్స్ పిల్లలకు అందజేస్తున్న సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చిల్డ్రన్ బైబిల్ క్లాసులు (సీబీసీ) స్థానిక భాగ్యలక్ష్మీపేటలోని యేసుక్రీస్తు ప్రార్థనా మందిరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి ఆదివారం పాల్గొన్న పిల్లలకు సీబీసీ సర్టిఫికెట్స్‌ను మందిరం నిర్వాహకులు ఆదిమూలం దానియేలు చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో గాడ్ మినిస్ట్రి రెవ.మరపట్ల ప్రసన్నకుమార్ దైవ సందేశం అందజేశారు. సజీవమణి, ప్రియాంక, వరలక్ష్మి, సుదీర్, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే ప్రజల మద్దతు

మంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం 20వ వార్డులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్ర ప్రజలందరూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే మద్దతు పలుకుతున్నారని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక 20వ వార్డులో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పంపిణీ చేసిన జగనన్న కాలనీ స్థలాల్లో గృహాలు నిర్మించుకొనేందుకు అధికారులు తమవంతు బాధ్యత వహించాలన్నారు. పునాదులు నిర్మించుకొనేందుకు ఇబ్బంది పడుతున్న వారికి మెప్మా, డ్వాక్రా గ్రూపుల ద్వారా రూ.35 వేల ఆర్థిక సాయం అందించాలని ఆదేశించారు. స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో స్థలాలను వెనక్కి తీసుకొని, లేనివారికి అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించిన జగనన్న సురక్ష యాప్‌లో 11 రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్నామన్నారు. అవసరమైన పత్రాలను పొందేందుకు ఈనెల 24 నుంచి 18వ తేదీ వరకు వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వచ్చి వివరాలు సేకరించి జగనన్న సురక్ష యాప్ ద్వారా నమోదు చేస్తారని చెప్పారు. అనంతరం ఆయా వార్డుల వారీగా సభలు ఏర్పాటు చేసి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. 20వ వార్డులో రూ.12 లక్షల అంచనాలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మంత్రి కొట్టు శంకుస్థాపన చేశారు. ఈ వార్డులో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేశామన్నారు. నిర్మాణాలను పూర్తి చేసి ప్రజల వినియోగానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

అధికార దాహంతో కుయుక్తులు

అధికార దాహంతో చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నాడని మంత్రి కొట్టు సత్యనారాయణ ఆరోపించారు. 2019 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన షాక్ నుంచి చంద్రబాబు ఇంకా కోలుకోలేక పోతున్నాడన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికారం కోసం ఇప్పటి నుంచే ప్రజలను మోసం చేసేందుకు పన్నాగాలు పన్నుతున్నాడని వివరించారు. ఇందులో భాగంగానే జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను పావులా వాడుతున్నాడని, ఈ విషయాన్ని పవన్ గ్రహించడం లేదని అన్నారు. తన పరువు ప్రతిష్టలతోపాటు సామాజిక వర్గం ప్రతిష్టను భంగ పరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనపర్తి సామ్యూల్, ఎంఈ డి.మురళీకృష్ణ, ఏసీ గోపాలకృష్ణ, నాయకులు గుండుబోగుల నాగు, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, రాజా త్రినాథ్, గమిని సుబ్బారావు, దాసి బాబు, వట్టి బుజ్జి, మిద్దే ఆదినారాయణ, హరిదాసుల రవీంద్రకుమార్, బోళెం రామలక్ష్మి, బోణం విజయనిర్మల, పట్నాల గణపతి, చామన సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా జగనన్న సురక్ష సర్వే

తణుకు టౌన్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గ్రామాలో విస్తృతంగా సర్వే చేస్తున్నారు. పథకాలకు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారం తణుకు మండలం కోనాల గ్రామంలో 738 కుటుంబాలకు 453 గృహాలను సందర్శించి వివిధ ధ్రువీకరణ పత్రాల నిమిత్తం 110 టోకెన్‌లను జారీచేసి 65 సేవలు అందించినట్టు ఎంపీడీఓ పీ శ్రీనివాసరావు తెలిపారు. కొమరవరంలో మొత్తం 1914 గృహాలకు 1,114 గృహాలను సందర్శించి, 81 టోకెన్లను జారీ చేసి 67 సేవలు అందించినట్టు చెప్పారు.

నేడు డ్రగ్ ఫ్రీపై ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తాడేపల్లిగూడెం వారిచే సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఇంటర్నేషనల్ డ్రగ్ డేని పురస్కరించుకొని డ్రగ్ ఫ్రీ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్టు ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. ఆదిత్య డిగ్రీ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి స్థానిక అంబేడ్కర్ సెంటర్ వద్ద మానవహారం, ప్రతిజ్ఞలు చేస్తారని, వాసవి ఇంజినీరింగ్ కళాశాల, జీఎంఆర్ కళాశాలలో డ్రగ్ వల్ల వచ్చే దుష్ఫలితాలపై విద్యార్థుల మధ్య వ్యాసరచన, డిబేట్ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

మంత్రి కారుమూరికి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల వినతి



తణుకులో మంత్రి కారుమూరికి వినతిపత్రం ఇస్తున్న విద్యుత్ శాఖ కాంట్రాక్టు కార్మికులు

తణుకు అర్బన్: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఆదివారం విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరుతూ కార్మికులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను తెలంగాణ ప్రభుత్వ తరహాలో క్రమబద్ధీకరణ చేయాలని, లేనిపక్షంలో మన్మోహన్‌సింగ్ కమిటీ ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పీఆర్సీ సమావేశంలో తమ సమస్యలను విద్యుత్ శాఖ మంత్రి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కేఎల్ఎన్ రాజు, ఇ.ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్స్, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్‌ల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

కళారూపాలను పెంచి పోషించాలి



మాట్లాడుతున్న బుద్దాల వెంకట రామారావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలకు అవసరమైన, రంజింపజేసే కళారూపాలను పెంచి పోషించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు అన్నారు. కళారూపాలను పెంచి పోషించేందుకు వీలుగా గురువుల రాష్ట్రస్థాయి కార్యశాల రిసోర్స్ పర్సన్స్ స్టేట్ వర్క్ షాపు శిక్షణ తరగతులు ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రారంభమయ్యాయి. ఈ తరగతులు 29వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రారంభ సభకు ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు కవి అధ్యక్షత వహించారు. వర్క్‌షాపును డప్పు కొట్టి ప్రారంభించిన బుద్దాల రామారావు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం నాటి నుంచి నేటి వరకు పాటలు, వీధినాటకాలు, అనేకమైన కళా ప్రక్రియ నాంది ప్రస్తావన చేసి, ఎంతో మంది గొప్ప కళాకారులను తయారు చేసిన గొప్పసంస్థ ప్రజానాట్యమండలి అని కొనియాడారు. ప్రజలను రజింపజేసేదే కళ అని ప్రజల కోసమే కళా అని అన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ వీధి నాటకాలు, పాటలు, నాట్యం, కోలాటం, డప్పులు తదితర కళారూపాలకు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ గురువులుగా దండు నాగేశ్వరరావు, కవి, మురళీకృష్ణ, వంశీకృష్ణ హాజరయ్యారు. ప్రజా నాట్యమల్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనీల్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

విద్య, వైద్య సేవలు వెలకట్టలేనివి



ట్రస్టుబోర్డు సభ్యులను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: దాతృత్వంలో పట్టణ ఆర్యవైశ్యులు అగ్రస్థానంలో నిలుస్తారని, విద్య, వైద్య రంగాలకు వారు అందించిన సేవలు వెలకట్టలేనివని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ ప్రశంసించారు. పట్టణంలోని ప్రముఖ వైష్ణవ ఆలయంగా ప్రసిద్ధి చెందిన శ్రీ అష్టభుజలక్ష్మీనారాయణ స్వామి ట్రస్ట్ బోర్డు ప్రమాణ స్వీకారోత్సవ అభినందన సభ ఆదివారం రాత్రి శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘ భవనంలో అట్టహాసంగా నిర్వహించారు. సభలో ఎమ్మెల్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ ఆర్యవైశ్యులు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని, రానున్న రోజుల్లో ఎమ్మెల్యే తర్వాత ఆర్యవైశ్యులకు ముఖ్య పదవి ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆర్యవైశ్యులకు నామినేటెడ్ పదవుల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన పానకాలు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా జవ్వాజి వెంకట పానకాలు, ట్రస్టీలుగా నున్న వెంకట కోటేశ్వరరావు, చల్లా లక్ష్మీనారాయణమూర్తి, సాల శ్రీను, పొట్టిపాటి అన్నారాణి, ఉప్పలపు భారతీలక్ష్మి, కెల్లా భూలక్ష్మి, కర్రి వెంకట శ్రీనివాసాచార్యులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్‌ను ట్రస్టుబోర్డు చైర్మన్ పానకాలు గజమాలతో సత్కరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు అధ్యక్షతన నిర్వహించిన సభలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, మాజీ ఎమ్మెల్యే బంగారు ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, పార్టీ నాయకులు చిట్టూరి ఏడుకొండలు, ముచ్చర్ల శ్రీరామ్, అడబాల వెంకటరమణ,సాలా నరసయ్య, ఛాంబర్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు, మద్దా చంద్రకళ, మామిడి బాబు, కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, ఎంఎస్ వాసు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం

యలమంచిలి: చిన్న చిన్న కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారులను గుర్తించి జగనన్న సురక్ష పథకంలో వారందరికీ న్యాయం చేయాలని సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి కోరారు. శిరగాలపల్లి గ్రామ సచివాలయం వద్ద ఆదివారం జగనన్న సురక్ష పథకంపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్ఫ్ దేశాలకు వెళ్లడం వల్ల రేషన్ కార్డులో పేరు లేకపోవడం, ఆధార్‌లో సమస్యల వలన పింఛన్ అందకపోయినా, పొలాలకు సంబంధించి మ్యూటేషన్ ఇలా అన్ని సమ స్యలకు సురక్ష సర్వేలో పరిష్కారం పొందవచ్చునన్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా ఆదాయ, కుల, ఆధార్‌లో తప్పుల సవరణ ఇలా అన్ని రకాల ధ్రువపత్రాలు ఉచితంగా ఇస్తారన్నారు. కనుక సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ఈ పథకంలోని అంశాలను వివరించి ప్రభుత్వ గ్రాఫ్ పెంచాలని ఆయన కోరారు.

పెనుగొండలో..

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్షపై గ్రామాల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న 11 రకాల సేవలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటువారి సమస్యల పరిష్కారంకు తీసుకోవాల్సిన చర్యలపై పెనుగొండ మండలంలో తహసీల్దారు ఎస్.గురుమూర్తి రెడ్డి, ఎంపీడీఓ జి.శ్రీనివాస్ దొరలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులలతో కలసి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలులో సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు జగనన్న సురక్ష ఉపయోగ పడుతుందని ప్రజలకు వివరిస్తున్నారు.

ఐకమత్యంతో ఆర్యవైశ్యులు

తాడేపలిగూడెం అర్బన్ : పట్టణంలోని ఆర్యవైశ్యులు ఐకమత్యంతో ఒకే బాటపై నడుస్తున్నామని ఆర్యవైశ్య సంఘం సభ్యులు గమిని సుబ్బారావు తెలిపారు. ఆదివారం గమిని ఫంక్షన్ ప్లాజాలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గమిని మాట్లాడుతూ తాను ఇటీవల కాలంలో ఆర్యవైశ్య సంఘం కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్టు చెప్పారు. ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు తోపాటు సంఘం బైలా సూచనల మేరకు తాను తిరిగి ఆర్యవైశ్య సంఘం కార్యక్రమాల్లో కొనసాగనున్నట్టు చెప్పారు.

త్వరలో మరో పార్టీలోకి చేరిక

తాను బీజేపీ నాయకుడిగా పట్టణంలో కొనసాగుతున్నట్టు గమిని సుబ్బారావు చెప్పారు. భవిష్యత్తులో బీజేపీకి రాజీనామా లేఖను అందిస్తామన్నారు. అనంతరం మరో రాజకీయ పార్టీలోకి చేరనున్నట్టు వెల్లడించారు. ఆవివరాలను త్వరలో తెలియజేస్తామని తెలిపారు.

నేడు ఎంఆర్‌పీఎస్ ఎంఎస్పీ యువత సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాదిగ పోరాట సమితి ఎంఎస్పీ అనుబంధ సంఘాల తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికయిన ఇంటర్, డిగ్రీ, పీజీ యువత నియోజకవర్గ సమీక్షా సమావేశం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్టు మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వి.సిద్దు మాదిగ తెలిపారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశానికి కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు, అనుబంధ సంఘాల సీనియర్ నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా జూలై 7న ఎంఆర్‌పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో నిర్వహించాలని పేర్కొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా ఎనిమిది మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్యశాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్ తణుకు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని ఎనిమిది మందికి వైద్య పరీక్షలు చేసినట్టు చెప్పారు. సంఘ సభ్యులు యడ్లపల్లి శివ ప్రసాద్ ఆర్థిక సాయంతో మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి బాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో అడ్మిషన్ల గడువు పెంపు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల గడువు జులై 5వ తేది వరకూ పొడిగిస్తున్నట్లు ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. 2023–24 సంవత్సరం నుండి డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం మొదలవుతుందన్నారు. ఈ నూతన విద్యా సంవత్సరం నుంచి బీకామ్ నుంచి (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), బీఏ నుంచి (ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్), బీఎస్సీ నుంచి (మ్యాథ్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ) 9 సింగిల్ మేజర్ సబ్జెక్టు కోర్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 18న విద్యా మండలి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. జూన్ 19 నుండి జూలై 5 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం కాలేజీలో ఉచిత సౌకర్యం కల్పించామన్నారు. కళాశాల ఎంపికకు జూలై 7 నుంచి 12 వరకూ వెబ్ ఐచ్ఛికాలను కాలేజీలో ఉచితముగా నమోదు చేసుకోవచ్చన్నారు. జూలై 16 న సీట్ల కేటాయింపు 17 నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలు కోసం 91438 39999, 91217 02721, 80748 78227, 99631 80348కు ఫోన్ చేయాలని కోరారు.

రేపు పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

భీమవరం (ప్రకాశంచౌక్) : పిల్లల గుండె వ్యాధులకు సంబంధించి ఈనెల 27వ తేదీన మెంటేవారి తోటలోని, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్ వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరీశీలన చేసి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. 15 ఏళ్లలోపు వయసు గల చిన్నారులకు వైద్య శిబిరంలో ఉచిత పరీక్షలు, శస్త్ర చికిత్సకు వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని భీమవరం, పరిసర ప్రాంతాల వారు వినియోగించుకోవలసిందిగా కోరారు.

మావుళ్లమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

పెనుగొండ: సిద్ధాంతం గ్రామ దేవత మావుళ్లమ్మ ఆలయానికి భక్తులు తాకిడి పెరిగింది. ఆషాఢ మాసం, అమ్మవారి జాతర మహోత్సవాలు ఇటీవల అత్యంత వైభవంగా నిర్వహించారు. దీంతో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి బారులు తీరారు. అమ్మవారి దర్శనం అనంతరం పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా మావుళ్లమ్మఫ్రెండ్స్ యూనియన్ ఏర్పాట్లు చేశారు.

మానవత తణుకు కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత సంస్థ తణుకు కార్యవర్గం

తణుకు టౌన్: సమాజానికి విలువలతో కూడిన సేవా కార్యక్రమాలను మానవత సంస్థ అందిస్తున్నట్టు ఆ సంస్థ రాష్ట్ర విస్తరణ కమిటీ చైర్మన్ డాక్టర్ కోడూరి రాధాపుష్పావతి తెలిపారు. ఆదివారం సాయంత్రం తణుకు రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన తణుకు మానవత శాఖ 2023–24 నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మానవత సంస్థ అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో రాధాపుష్పావతి మాట్లాడుతూ మానవత సేవా కార్యక్రమాల నిర్వహణలో తణుకు శాఖ మూడో స్థానంలో నిలిచినట్టు చెప్పారు. గతేడాది తణుకు శాఖ ఆధ్వర్యంలో 60 సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. దాతలు, సభ్యుల సహకారంతో నెలకు 5 సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా నూతనంగా నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా అక్కాపంతుల బాలాజీ, ఉపాధ్యక్షురాలిగా కఠారి శారదాదేవి, కార్యదర్శిగా ఆలపాటి సోమేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా పి.రామకృష్ణంరాజు, కోశాధికారిగా అక్కిన కాశీవిశ్వనాథం, ఇతర కార్యవర్గ సభ్యులతో మానవత జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మానవత జిల్లా సభ్యులు బి.రామలక్ష్మి, ఎస్వీ సతీష్ బాబు, వి.హనుమంతరావు, పాల్గొన్నారు.

మానవత సేవల విస్తృతానికి కృషి



మానవత కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మానవత సేవలను మరింతగా విస్తృతం చేస్తామని పలువురు మానవత సభ్యులు పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తాడేపల్లిగూడెం శాఖ నూతన కార్యవర్గం 2023–24 సంవత్సరానికి ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించారు. మానవత జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు, సెంట్రల్ రీజియన్ కన్వీనర్ బోయపాటి రామలక్ష్మి, జిల్లా ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ సాగిరాజు జానకీ రామరాజు హాజరైయారు. నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా సాధనాల త్రిమూర్తులు, కార్యదర్శిగా రాజన్ ఆరుమైనాథన్, కోశాధికారిగా యర్రా ఆంజనేయస్వామి, ఉపాధ్యక్షుడిగా బండి ధనలక్ష్మి, సహాయ కార్యదర్శిగా తుమరాడ చిన్న, ఈసీ ఎడ్యుకేషన్‌గా కురుమెళ్ల వెంకటాచలం, ఈసీ హెల్త్‌గా మోటూరి వెంకటరత్నం, ఇసీ ఎవేర్‌నెస్‌గా మడమల బాబూరావు, ఈసీ ఎమర్జెన్సీగా మిరియాల కిషోర్‌కుమార్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పైడికొండల సింధు, ముప్పిడి సురేష్ రెడ్డి, చేకూరి బంగ్రారాజు, బురిడి సతీష్, భోగవల్లి రాజా, బుద్దాల వెంకట రామారావు, మానవత సభ్యులు, తదితరులు హాజరైయారు.

సొంతింటి కల నెరవేర్చుకున్న లబ్ధిదారులు

పాలకొల్లు సెంట్రల్: దేశంలో ఇల్లు లేని పేదవాళ్లకు సొంతింటికల నెరవేర్చాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన పీఎంఏవై పథకం ప్రారంభించి ఎనిమిదేళ్లు పూర్తయ్యిందని పట్టణ ప్రణాళికా విభాగం అధికారి వీరబ్రహ్మం అన్నారు. ఆదివారం స్థానిక టిడ్కో గృహాల లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మం మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస యోజన పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా లబ్దిదారులకు గృహాలు నిర్మిస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా పట్టణంలో 6144 మందికి టిడ్కో గృహాలు మంజూరు చేశామన్నారు. సుమారు 1850 మందికి గృహాలు అందజేశామని త్వరలో మిగిలిన లబ్దిదారులకు గృహాలు అప్పగించి వారి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ త్రినాథరావు, సీఎంఎం ఎస్.రత్నాకర్, సీఏల్‌టీసీ వీరభద్రం, సీఓలు సునేత్ర, రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కేశవస్వామి మరియు మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానమునకు చెందిన ఖాళీ స్థలమును లీజుకు ఇచ్చుటకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

[illegible]

వ. నెం.	ఆర్.ఎస్.నెం.	విస్తీర్ణం	ధరావత్తు	లీజు కాలము	వేలం జరుగు ప్రాంతము, తేది, సమయము
1	482/1	0.20½ సెంట్లు	50,000/-	అప్పగించిన తేది నుండి 11 సంవత్సరములు	[illegible]

[illegible]

తణుకు
తేది: 25.06.2023

[illegible] ధర్మకర్తల మండలి సభ్యులు

ముత్యాల సత్యనారాయణ
[illegible]

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395, 63097 62918

తణుకు: 90108 43311, 90100 51493

Office mail : tpgadvt@gmail.com